

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



*మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.*

(గత సంచిక తరువాయి)

"కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు" అని నేనేదో చెప్పబోయాను. అతను నన్ను మధ్యలో ఆపి, "ఎస్సెన్జీ దాస్?'" (అది మీరు తింటారా?) అంటూ తోటలోని లాన్ చూపించాడు.

అతడి హేళన నాకర్థమైంది, "యూరోపియన్ సైంటిస్టులు అందులో ప్రోటీన్లు బాగా ఉన్నాయని అంటున్నారు కానీ, ఇండియన్ శాకాహారులింకా అది తినడం మొదలెట్టలేదు" అని అమాయకత్వం నటిస్తూ బదులిచ్చాను. వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలంటారు కానీ, వ్యంగ్యాన్ని అధిగమించడానికి అమాయకత్వాన్ని మించింది లేదని చిన్నప్పుడే తెలుసుకున్నాను.

మా తాతగారు నాకో కథ చెప్పారు. ఆయన మిత్రుడొకడు పనివాణ్ణి ఏడిపించడానికి, "ఒరేయ్, నువ్వు సర్వం తెలిసిన పరమ మూర్ఖుడివి" అన్నాడట. దానికా పనివాడు కంగారుపడి, "అంత పెద్ద మాటలకు తమబోటివారే కానీ నేను తగను" అని వినయంగా, అమాయకంగా బదులిచ్చేట్ట.

ఫ్రౌ యాకేల్ మాత్రం తన సోదరుడి ప్రశ్నకు చాలా నొచ్చుకుని తర్వాత అతన్ని నాతో మాట్లాడనివ్వలేదు.

మధ్యమధ్య సెలవురోజుల్లో కాలక్షేపంకోసం ఫ్రౌ యాకేల్ ఇంటికి వెడితే ఆమె తోటపనిలో ఉండేది. చిన్నప్పుడు మా తాతగారు మాలాంటి పిల్లలచేత తోటపని చేయించేవారు. ఆ మాట చెప్పి ఆమెకు తోటపనిలో సాయపడేవాణ్ణి. అలాంటప్పుడు ఆమె నాకు ఏదైనా తినుబండారం ఇవ్వజూసేది. ఆమె వంటకాలు నాకు అంతగా రుచించవు. ఆ మాట చెప్పలేక, "సరదాగా సాయపడ్డం మా దేశంలో నాకు మామూలే. ప్రతిఫలమిస్తే మాత్రం మొహమాటంగా ఉంటుంది" అని సద్ది చెప్పాను.

దానికామె ఇచ్చిన జవాబు నా ఊహకి అందలేదు. "ప్రతిఫలం లేకుండా తోటపనిలాంటివి చెయ్యడం మా దేశంలో మామూలు కాదు" అందామె. అక్కడ ఇంటిపనికి గంటకి ఐదు మార్కులు, తోటపనికి గంటకి పది మార్కులు ఇవ్వాలిట.

అవి ఇండియాలో పనివాళ్ల నెల జీతాలకంటే ఎక్కువున్నాయని చెప్పాను. ఆమె ఆశ్చర్యపోయి ఇండియాలో వివిధ వస్తువుల ధరలడిగింది. "రెండువేల ఐదొందల మార్కులౌతుందని ఇంట్లో ఓ గదికి కొత్త కిటికీ వేయించలేక పోతున్నాను. ఇండియాలో అన్నీ కారుచౌక" అందామె నిట్టూర్చి.

ఇక్కడ నాకొచ్చే స్కాలర్‌షిప్‌తో ఏడాది తిరక్కుండా ఫ్రిజ్, మిక్సీ, వాష్‌మెషీన్, టేప్‌రికార్డర్ వగైరాలన్నీ కొనుక్కోగలను. ఐదేళ్లుగా ఉద్యోగం చేస్తూ అక్కడ ఇంతవరకూ నిత్యావసరమైన మిక్సీ కూడా కొనలేకపోయాను. ఇక్కడికొచ్చేదాకా నాకు టేపు రికార్డర్ లేదు. ఈ విషయాలు ఆమెకి చెప్పలేదు. మన దేశం గురించి కొంత పాజిటివ్ ఫీలింగ్ వచ్చినప్పుడు దాన్నలాగే ఉండనివ్వడం మంచిదే అనిపించింది.

నేను నిజాయితీగానే సాయపడాలనుకుంటున్నట్లు గుర్తించడం వల్లనేమో, ప్రతిఫలం గురించి నొక్కించడానికి కొంచెం ఇబ్బంది పడిందామె. అది గ్రహించిన నేను, నా బట్టలుతికిపెట్టడంలో ఆమెకు లభించిన ప్రతిఫలం ఏముందనాలనుకున్నాను. ఐతే ఆ మాటనడానికి నేనూ ఇబ్బంది పడ్డాను.

జర్మనీలో కుటుంబ జీవితం సంతృప్తికరంగా ఉండదనీ, సంబంధాలన్నీ ఆర్థికపరమైనవేననీ – ఇండియాలో అనుకోవడం విన్నాను. కానీ ఇక్కడికొచ్చేక నాకది నిజమనిపించలేదు.

ఒకసారి ఫ్రౌ యాకేల్ కూతురు పుట్టింటికి వచ్చింది. తనతో ఆమె భర్త, పిల్లలు కూడా వచ్చారు. అంతా కలిసి నాలుగు రోజులు ఎంతో సరదాగా గడిపారు. ఆ నాలుగు రోజుల్లోనూ అల్లుడామె ఇంటికి కొత్త వాల్‌పేపర్ అంటించాడు (అక్కడ ఇళ్లకు వెల్లకు బదులు వాల్‌పేపర్ వాడతారు). రేడియో బాగుచేసి పెట్టాడు.

ఒకరోజున యాకేల్ కూతురు, పదేళ్ల మనవడు ఇంటి అటకమీద చాలాసేపు గడపడం చూసి ఆశ్చర్యపడ్డాను. పిల్లల బొమ్మలు, ఆటవస్తువులు అటకమీదున్నాయనీ, అటక కూడా ఓ గదిలాగే ఉంటుందనీ తర్వాత తెలిసింది.

ఒకరోజు యాకేల్ మనుమడు నా దగ్గరకొచ్చి కాసేపు గడిపాడు. అతనికి ఇంగ్లీషు సరిగ్గా రాదు. ఐతే నాకొచ్చిన జర్మన్ భాష ఆ కుర్రాడికి బాగానే అర్థమైనట్లుంది. నాతో అతనికి మంచి కాలక్షేపమే అయిందనేందుకు సూచనగా మర్నాడు కూడా అతను నా గదికి వచ్చాడు.

అప్పట్లో పోలరాయిడ్ కెమేరాలు కొత్త. కెమేరాలో ఫిల్మ్ పెట్టి ఫొటో తీసిన రెండు నిముషాల్లో ఫొటో ప్రింటు బయటకు వచ్చేస్తుంది. ఫ్రౌ యాకేల్ అల్లుడు ఆమెకి ఓ రంగుల ఫొటో తీశాడు. అది నాకు చూపించి ఎంతో సంబరపడిందామె. అప్పుడు నాకు మా మామ్మగారు గుర్తుకొచ్చారు.

యాకేల్‌కి ఎవర్ని ఎక్కడుంచాలో బాగా తెలుసు. మరీ ఎక్కువమంది మిత్రుల్ని గదికి ఆహ్వానించొద్దని ఓసారి చెప్పింది. నా రూంలో రేడియో సౌండ్‌ఎక్కువైందని రెండుసార్లు వచ్చి చెప్పింది, కాస్త తగ్గించమని. వంట చేసుకుందుకు వీలౌతుందా అంటే కుదరదంది. మాట కటువుగా ఉండేది కాదు, విన్నపంలా ఉండేది. ఆమెకి నేను నచ్చాలంటే, ఆమెకి నచ్చేలా ఉండాలని కూడా నేను గ్రహించాను.

ఫ్రౌ యాకేల్‌కి నా పక్కరూంలో ఉండే వైయాంగ్ నచ్చలేదు. అతను బాగా సిగరెట్లు కాలుస్తాడనీ, బాత్రూమ్ అపరిశుభ్రంగా ఉంచుతాడనీ నా దగ్గర విసుక్కునేది.

వైయాంగ్ మిత్రుడొకడు వరుసగా రెండు రాత్రిళ్లు అతని గదిలోనే పడుకున్నాడు. ఆ విషయం యాకేల్‌కి తెలిసింది. అలా కుదరదని చెప్పడానికి అతని రూంకి వెళ్లింది. ఆరోజు వైయాంగ్ పుట్టినరోజు. ఆమె వచ్చినప్పుడు నేనూ అతని రూంలో ఉన్నాను. యాకేల్‌కి విషయం అర్థమైంది. వెంటనే వెనక్కి వెళ్లి కొన్ని బిస్కట్లు తెచ్చి వైయాంగ్‌కిచ్చి శుభాకాంక్షలు చెప్పి వెళ్లింది. ఆ రోజుకి ఏమీ అనక, మర్నాడు హెచ్చరించింది వైయాంగ్‌ని. అరుదైన ఆ సుహృద్భావానికి నా మనసు ఆర్ద్రమైంది.

వైయాంగ్ గది నేనున్న గదికంటే చాలా పెద్దది. నాకంటే ముందు రావడంవల్ల అతడికా పెద్ద గది వచ్చిందట. అతను తొందరగా వెళ్లిపోతే, నాకా గది ఇవ్వాలనుండేది ఆమెకి. ఆమె కోరిక తీర్చడానికే అన్నట్లు రెండు నెలల కోర్సు పూర్తి కాగానే వైయాంగ్ ఆ గది కాళీ చేసి మరో చోటకి వెళ్లిపోయాడు. ఆమె మహా సంతోషంతో వెంటనే నాకా పెద్ద గది ఇచ్చేసింది.

నిజానికి నాకూ వేరే ఇంటికి మారాలన్న కోరిక ఉంది. రెండునెల్ల కోర్సు అవగానే, కావాలంటే నేను ఇంకో ఇంటికి మారవచ్చు. వంట చేసుకునే సదుపాయమున్న ఇల్లయితే బాగుండునని నాకుంది. అప్పటికీ వంట సదుపాయం లేక నాకు చాలా ఇబ్బందిగా ఉందని ఫ్రౌ యాకేల్‌తో రెండు మూడుసార్లు అన్నాను. ఆమె జాలి పడింది తప్పితే వంట చేసుకోమని అనలేదు. అంతకుమించి అడగడానికి నాకూ మొహమాటం వేసింది. ఐనా ఆ రెండు నెలల్లోనూ యాకేల్‌తో ఏర్పడిన ఆత్మీయానుబంధం నన్నా ఇల్లు మారనివ్వలేదు. కేవలం వంట సదుపాయంకోసం ఆమె అభిమానానికి దూరమై వేరే ఇంటికి మారడానికి నాకు మనసొప్పలేదు. కలకాలం ఐతే వేరే మాట – నేనక్కడుండేది మరో రెండు నెలలే!

## ఇదీ వరస

ప్రతిరోజూ ఉదయం ఆరున్నర తర్వాత లేచేవాణ్ణి. అంతకు ముందు లేస్తే వ్రాతపనులు చూసుకునేవాణ్ణి. తెమలడానికి నాకక్కడ క్షణం కూడా వృథా అయ్యేది కాదు. ఎందుకంటే బస్సు ఏడూ ఐదు అంటే సరిగ్గా ఏడూ ఐదుకే బయల్దేరుతుంది. ఒక్కరోజు కూడా ఒక్క సెకన్ లేటవదు.

చిన్నప్పట్నించీ గడియారం ముళ్లతో తిరిగే మనిషిని. ఇంట్లో గోడ గడియారాన్నీ, రోడ్లమీద రేడియో కార్యక్రమాల్నీ, కాలేజిలో టవర్‌క్లాక్‌నీ నమ్ముకుని – చేతికి వాచీ ఉన్నవాళ్లకంటే పక్కాగా సమయపాలన చేసేవాణ్ణి. కానీ అక్కడ బస్సులు, రైళ్లు వగైరాలు వేటికీ సమయపాలన లేదు. మనుషుల సంగతి సరేసరి. అందువల్ల నా ప్లానింగులో – నాకు అదుపులేని చాలా విషయాల్ని పరిగణనలోకి తీసుకోవాల్సివచ్చేది.

ఉదాహరణకి భువనేశ్వర్లో మా కాలనీనుంచి ఊళ్లోకెళ్లాలంటే, కిలోమీటరు నడిచి ఉత్కళ యూనివర్సిటీలోని వాణీవిహార్ స్టాప్ చేరి అక్కడ బస్సెక్కాలి. అప్పట్లో స్కూటరే కాదు, సైకిలుండడం కూడా గొప్ప. వాణీవిహార్‌కి బస్సు టైమ్ సాయంత్రం నాలుగున్నర. అది ఒకోసారి నాలుగుకే వచ్చేసేది. ముందొచ్చిందని నాలుగున్నరదాకా ఆగదు. వెంటనే వెళ్లిపోవడమే. కానీ సాధారణంగా అది ఐదుకు వచ్చేది. ఆ బస్సు మిస్సవకూడదంటే, నాలుగులోపే అక్కడకు చేరుకుని, ఐదు దాకా ఎదురుచూడాలన్నమాట! ఉత్తపుణ్యాన గంట వృథా.

అలాంటిదిక్కడ టౌన్‌బస్సు అంత పంక్చువల్‌గా ఉండడంవల్ల నాకెంత టైం కలిసొచ్చేదో చెప్పలేను. జర్మనీకి వచ్చిన పనికి పూర్తి న్యాయం చేస్తూనే – డైరీ, అకౌంట్, పెద్ద పెద్ద ఉత్తరాలు, కథలు వ్రాసుకుంటూ – మిత్రులతో కలిసి తిరిగానంటే – జర్మనీలోని సమయపాలనా వ్యవస్థకి జోహారులనక తప్పదు.

సమయపాలన విషయంలో నేనిక్కడ గమనించిన మరో విశేషం, నడకలో వేగం. భువనేశ్వర్లో ఇంటినుంచి ఆఫీసుకి పది నిముషాల నడకైతే, నేను పావుగంట ముందే బయల్దేరి, వేగంగా నడిచి ఆరేడు నిముషాల్లో ఆఫీసుకి చేరుకునేవాణ్ణి. పక్కన ఎవరైనా మిత్రులుంటే మాత్రం నన్ను చేయి పట్టుకుని ఆపి, “ఏమిటా పరుగు?” అని మందలించేవారు. నడవడానికి వీలైనంత తక్కువ సమయం తీసుకోవాలని నేను, శ్రీమతి కూడా అనుకునేవాళ్లం కానీ – ఇండియాలో వేగంగా నడిచే ఆడవాళ్లు చాలా తక్కువ కావడం వల్ల ఆమె తరచుగా ఇబ్బంది పడేది. జర్మనీలో ఆడా, మగా అన్న తేడా లేకుండా ఎవరి సామాను వారు మోసుకుంటూ, వెనుక ఎవరో తమని తరుముతున్నారన్నట్లు పరుగులాంటి నడకతో సాగిపోయేవారు. అలా ఒకసారి ఓ జర్మన్ యువతి వేగంగా వెళ్లిపోతూ, నా చేతికి డాష్ఇచ్చి, మర్యాదకు సారీ చెప్పి, అదే వేగంతో వెళ్లిపోయింది. తర్వాత చూసుకుంటే నా చేతి వాచీకి అద్దం లేదు. వాచి షాపులో స్పెషల్ రెంచి పెట్టి తిప్పితేనే కానీ ఊడని అద్దమది. అదీ ఆ యువతి వేగపు బలం. కొత్త వాచీ కొనాల్సొస్తుందని భయపడ్డాను కానీ, అదృష్టం కొద్దీ, ఓ షాపతను ఆరు మార్కులకి కొత్త అద్దం వేసిపెట్టాడు. అప్పట్నించీ ఎదురుగా ఎవరైనా వేగంగా వస్తుంటే, ఆ వచ్చేది అమ్మాయిలైనా సరే, వాచీ ఉన్న చేతిని దాచుకుని, ఆమడ దూరం పక్కకి తప్పుకునేవాణ్ణి.

ఉదయం బస్సులో గ్యోతే ఇన్స్టిట్యూట్‌కి వెళ్లి బ్రేక్‌ఫాస్ట్ చేసేవాణ్ణి. జర్మన్ పాఠాలు నేర్చుకున్నాక అక్కడే స్నానం చేసేవాణ్ణి. తర్వాత కాసేపు మార్కెట్లో తిరిగి కావలసినవి కొనుక్కుని బస్సులో ఇల్లు చేరేవాణ్ణి. బ్రెడ్‌స్లైసులు, ఆపిల్సు, అరటిపళ్లు డిన్నరు. ఆపిల్ లేదా ఆరెంజి జ్యూస్ పానీయం. రాత్రి పడుకునేలోగా వీలునిబట్టి వ్రాత, చదువు. ఈ అలవాట్లతోనే ఇక్కడ నెలకి రెండు కేజీల చొప్పున పెరిగి, ల్యూనబర్గ్ వదిలేటప్పటికి యాభైరెండు కేజీల బరువయ్యాను. అప్పుడు నా అలవాట్లు నా వెన్ను తట్టి మెచ్చుకున్నట్లనిపించింది.

అంతా నన్ను చలి గురించి బెదరగొట్టేశారు కానీ, ఇక్కడ చలి అంటే మంచు కురిసే చలికాలంలో కూడా మనిషిని తినేసే పులేం కాదు. ఇళ్లలో వెచ్చగా ఉంటుంది. షాపులు, బస్సులు, రైళ్లు, కార్లు అన్నీ లోపల వెచ్చగా ఉంటాయి. ఈ మధ్యలో కాసేపు బయట నడక అవసరమైతే, వంటిని రక్షించడానికి స్వెటర్లు, కోట్లు, ఓవర్‌కోట్లు, షూస్ వగైరాలున్నాయి. నిజానికి చలి ఎక్కువ బాధించేది మన దేశంలోనే! ఎటొచ్చీ అక్కడ వేసవి కూడా మన చలికాలంలాగే ఉంటుంది. ఆ చలిలో నేను తరచుగా మన దేశంలోలాగే స్వెటర్లేకుండా, ఆకుచెప్పులతో బయట తిరిగాను. చాలా ఆహ్లాదకరంగా ఉండేది.

నిజం చెప్పాలంటే, మనం చలికి కంటే, అక్కడి వాళ్లు వేడికి పడే భయం ఎక్కువ. ఆగస్ట్ 14న వేసవి మొదలైందని రేడియోలో హెచ్చరిక విన్నాను. ఆ రోజు టెంపరేచర్ ఇరవైఎనిమిదని గుర్తు. ఆ సాయంత్రం మగాళ్లంతా డ్రాయర్లలాంటి నిక్కర్లతోనూ, ఆడాళ్లంతా బికినీలతోనూ ఉఫ్‌ఉఫ్ అనుకుంటూ వీధిన పడ్డారు. మేమూ వీధిన పడ్డాం కానీ – అది వాళ్లని చూడ్డానికి. ఎప్పటిలాగే నిండు దుస్తులు ధరించిన మమ్మల్ని చూసి వాళ్లెవరూ సిగ్గుపడలేదు కానీ, అంతమందికి భిన్నంగా ఉన్నందుకు మేమే సిగ్గుపడ్డాం.

“ఇండియాలో ఐతే 40 డిగ్రీలు దాటిపోతుంది. అక్కడేం చేస్తారో వీళ్లు” అని మాలో మేము మాట్లాడుకోవడం విన్న ఒకరిద్దరు జర్మన్సు ఆగి కళ్లు పెద్దవి చేసుకుని, ఆ తర్వాత గుండెలు బాదుకుంటూ వెళ్లారు. ఆ సాయంత్రం ఊళ్లో ఫ్రైబాడ్, కూర్‌జెంత్రమ్ వగైరా స్థలాల్లో స్విమ్మింగ్‌పూల్సు నీళ్లతో బదులు మనుషులతో నిండిపోయాయట.

ఇండియన్ మిత్రులు నన్ను తోడబుట్టినవారికంటే ఎక్కువగా ఆదరించారు. వంట సదుపాయం ఉన్నవాళ్లు తరచు నన్ను భోజనానికి పిలిచేవారు. అప్పుడప్పుడు పనికట్టుకుని నా ఇంటికొచ్చి నా ఆతిథ్యాన్ని స్వీకరించేవారు. ఇంటామె నాకిచ్చిన కేక్సు వాళ్లొచ్చినప్పుడు చెల్లిపోయేవి. లొట్టలు వేసుకుంటూ మరీ తినేవారు.

అక్కడ ఇంచుమించు మిగతా ఇండియన్సందరికీ సాటివారి తోడుంది. నాకు దగ్గర్లో ఎవరూ లేరన్న భావనతో వాళ్లు నన్ను దృష్టిలో ఉంచుకుని తమ కార్యక్రమాలు రూపొందించుకునేవారు. బయటి ఊళ్లకి పిక్నిక్కులే కాక, ఊళ్లోనూ మేమంతా కలిసి బాగా తిరిగేవాళ్లం. అలా మేము చూసినవాటిలో ఫోగెల్ పార్క్ (బర్డ్స్ శాంక్చ్యువరీ), జూ సామాన్యంగా అనిపించాయి. మాకక్కడ ఆసక్తి కలిగించినవాటిలో సెప్టెంబర్లో జరిగిన స్టాడ్‌ఫెస్ట్ (టౌన్‌ఫెయిర్) చెప్పుకోతగ్గది. చూడ్డానికది మనకి పండుగల్లో వచ్చే తీర్థంలా ఉంది. అక్కడ చిన్నపిల్లల వినోదానికి అత్యాధునిక రంగులరాట్నాలు, రోలర్ కోస్టర్లు వగైరాలున్నాయి. వాటిని కాదని, ఒకచోట గడ్డికుప్పలుంటే వాటితోనూ అంత ఉత్సుకతతోనూ ఆడుకునే పిల్లల్ని చూసి, ఎక్కడైనా పిల్లలు పిల్లలే కదా అనుకుంటూ మా పిల్లల్ని గుర్తు చేసుకున్నాను. అక్కడ మొదటి రోజు ఉచితంగా బీరు పోస్తే జనం దానికోసం ఎగబడ్డం ఇండియాని గుర్తు చేసింది. ఐతే అదో సరదాయే కానీ ఆబ కాదు. ఒకరోజు వివిధ వాయిద్యాల ఆర్కెస్ట్రా, ఒకరోజు కొందరు గాయనీగాయకుల పాటలు. ప్రదర్శనలకంటే అక్కడి వాతావరణం ఎక్కువ నచ్చింది మాకు.

అక్కడకొచ్చేక ఇండియన్సులో ప్రాంతీయ, మత, భాషా భేదాల స్ఫురణ తగ్గిపోతుంది. ఇండియన్ అంటే ఇండియన్ అంతే! అంతా మనవాళ్లేననుకుంటూ, ఒకరికొకరు బాసటగా ఉండడం బాగా అనిపించేది నాకు. ఐతే నాకు ఒంటరితనం ఫీలింగ్ కలక్కుండా చెయ్యడం తమ బాధ్యతగా వాళ్లు భావించడంలో, వారితోపాటు నాకూ కొంత ఇబ్బంది ఉండేది. ఎందుకంటే నేను డైరీ వ్రాస్తాను, అకౌంట్ వేస్తాను. వివిధ

పత్రికలకు కథలు పంపుతాను. నా మటుక్కు నేను యమ బిజీ. ఆ విషయం వాళ్లు గ్రహించాలని, నేను రచయితనన్న విషయం వారికి చెప్పక తప్పలేదు. వారిలో తెలుగు తెలిసినవారు ఒకరిద్దరున్నా, సాహిత్యాభిలాషులు కారు కాబట్టి, బయటపడ్డానికి నేను సంకోచించలేదు.

ఇంటామె తరచుగా తనింట్లో టివి చూడ్డానికి పిలిచేది. ఒకసారి హిమాలయాల్లో ఎలుగుబంటిని పట్టే డాక్యుమెంటరీ వస్తోందంది. ఒకసారి నేను వెళ్లబోయే బెర్లిన్ మీద డాక్యుమెంటరీ వస్తోందంది. ఒకసారి ఏదో మ్యూజిక్‌బాండ్ కార్యక్రమం వస్తోందనీ, ఆ బ్యాండ్ కొన్నాళ్లక్రితం ల్యూనబర్గు వచ్చినప్పుడు టికెట్ ఏకంగా 19 మార్కులనీ, ఇప్పుడదే కార్యక్రమం టివిలో ఫ్రీగా చూడొచ్చనీ అంది. ఎప్పుడు పిలిచినా ఆమె కళ్లలో ఎక్సయిట్మెంట్. ఆమె ఇంట్లో కొన్ని జర్మన్ సినిమాలు కూడా చూశాను. కథ, చిత్రీకరణ, నటన పరంగా అవి ఉత్తమ స్థాయిలో ఉన్నాయి. ఆ కథాంశాల్నిబట్టి మనోవిశ్లేషణ పరంగా మనుషులంతా ఒక్కటేననిపించింది. ఇంకా ఫెర్న్‌జెహె లొట్టో (టెలివిజన్ లాటరీ) కార్యక్రమంలో వచ్చే కొన్ని అంశాలు నన్ను బాగా ఆకర్షించేయి. ఒక హాలండర్ (హాలెండ్ దేశస్థుడు) నిర్వహించిన కుటుంబ కార్యక్రమంలో, తల్లి–కొడుకు, తండ్రి–కూతురుల జంటల మధ్య జరిగిన పోటీ రౌండ్స్, ఆరోగ్యకరమైన వినోదానికి మచ్చుతునక అనిపించింది. భువనేశ్వర్ తిరిగి వెళ్లేక అదే తరహాలో ఒక తెలుగు కార్యక్రమం కూడా రూపొందించాను. అప్పటికింకా టివిలు లేవు. ఇప్పటి తెలుగు టివి ఛానెల్సులోని కుటుంబ కార్యక్రమాలు ఇంకా ఆ స్థాయికి దరిదాపుల్లో లేవు.

నటరాజన్ ఇంట్లో అతని హౌస్‌ఫ్రౌ ఆహ్వానంమీద ఒకసారి జర్మనీలోని బవేరియన్ సంగీత కార్యక్రమం చూశాను. బవేరియన్లు యోడ్లింగుకి సుప్రసిద్ధులు. వాళ్లంత సహజంగా యోడ్లింగ్ చెయ్యగల గాయకుడు ఇండియాలో అప్పట్లో కిషోర్‌కుమార్ ఒక్కడే.

స్టాంపులకోసం నేను తరచుగా పోస్టాఫీసుకి వెళ్లేవాణ్ణి. ఎక్కడపడితే అక్కడ ఆటోమాట్లు ఉన్నాయిగా, దూరంగా ఉన్న పోస్టాఫీసుకెందుకూ శ్రమపడి వెళ్లడం అనేవారు మిత్రులు. కానీ ఆటోమేట్లలో స్పెషల్ స్టాంపులు ఉండవు. నా ప్రియమిత్రుడు సూర్యనారాయణ, కేవలం స్పెషల్ స్టాంపులకోసం, నాకు జర్మనీ వెళ్లే అవకాశం రావాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాడు. అతనికోసం పోస్టాఫీసుకి వెళ్లి, స్పెషల్ స్టాంపులు కొనడం ఆనందమే తప్ప శ్రమ అనిపించేది కాదు. కార్డులు, ఏరోగ్రామ్సుతో చౌకగా ఐపోతుందని తెలిసి కూడా, కుబేరుడి సిద్ధాంతాన్ననుసరించి, ఉత్తరాలు వ్రాసి కవర్లో పెట్టి పంపేవాణ్ణి – స్పెషల్ స్టాంపులు అతికించే అవకాశం ఉంటుందని. నాకు ఇండియానుంచి మిత్రుల ఉత్తరాలు వచ్చేవి. కొందరు తమకేవో కావాలని అడిగేవారు. టేపు రికార్డరు వగైరాలు తేలేననీ, ఎలక్ట్రిక్ పరికరాలపై ఐతే నిషేధముందనీ వ్రాస్తే, నొచ్చుకోకుండా సరేననేవారు. క్యాసెట్లు కొని పోస్టులో పంపేవాణ్ణి. వాడని కాసెట్లకి కస్టమ్స్ డ్యూటీ పడుతుందని, వాటిని రేడియో రికార్డర్లోని జర్మన్ మ్యూజిక్‌తో నింపి పంపేవాణ్ణి. వాళ్ల ద్వారా మా కాలనీవీ, దేశంలోవీ విశేషాలు తెలిసేవి. ఒక ఉత్తరంలో ఒకతను బియ్యం ధర కేజీ మూడు రూపాయలైందని గుండెలు బాదుకుంటూ వ్రాశాడు.

చిత్రమేమిటంటే నేను ఒకరికి చిన్న ట్రాన్సిస్టరు, ఒకరికి విల్కిన్సన్ బ్లేడు కవర్లో పెట్టి పంపాను. అవి ఏ స్కానింగుకీ గురి కాలేదేమో, క్షేమంగా వారిని చేరాయి. అలాగే శ్రీమతి ద్వారా నాకు రెండు పిన్నీసులు, ఓవర్‌కోటు బొత్తాం కుట్టుకునేందుకు చిన్న సూది, మొలతాడు, బూటులేసులు కూడా వేర్వేరు సమయాల్లో అందాయి.

రోజుకొకసారైనా కాసెట్టేపులో పిల్లల మాటలు, పాటలు వినేవాణ్ణి. ఆ శబ్దతరంగాలు లేత ఉరుముల్లా చెవులకి తాకగానే, కళ్లలో నీళ్లు చిరుజల్లులై కురిసేవి. అంత దగ్గరగా వినబడుతున్న ఆ మాటలు నన్ను ఎన్నో వేల మైళ్ల దూరం తీసుకుపోతూండేవి.

పిల్లలిద్దరూ నాకు బాగా అలవాటు. నేనేదైనా తింటుంటే వాళ్లిద్దరూ నా దగ్గర చేరి, "నాన్నగారూ, నాకో, నాకో?" అంటుండేవారు. ఇప్పుడు నేను బ్రెడ్ స్లైసులు తింటుంటే వాళ్లిద్దరూ చెరో పక్కనా నిలబడి, "నాన్నగారూ, నాకో, నాకో?" అంటున్నట్లే అనిపించేది.

"ఇక్కడ సదుపాయాలు అపూర్వం. సౌకర్యాలు అద్భుతం. ఈ దేశమొక స్వర్గం. కానీ భార్యాబిడ్డలు దగ్గర లేకపోయాక, ఏంచేసుకోనీ స్వర్గాన్ని?" అని బాధపడేవాణ్ణి.

కలలొచ్చేవి. ఆ కలల్లో శ్రీమతి కనిపించేది కన్నీళ్లతో. ఇలలో ఆమెనుంచి క్రమం తప్పకుండా ఉత్తరాలొచ్చేవి. ఆ ఉత్తరాలు చదువుతుంటే నాకో విషయం అర్థమైంది. పెళ్లయిన ఆడపిల్లకి, భర్త పక్కన లేకపోతే – పుట్టినిల్లయినా, మెట్టినిల్లయినా, తోడబుట్టినవారి ఇల్లయినా – అది పరాయిదే!

అబ్బాయికి రెండేళ్లు నిండాయి. అమ్మాయి వాడికంటే ఏణ్ణర్థం పెద్ద. ఇద్దరిదీ ఎదిగే వయసు. కొత్త మాటలు నేర్చుకుంటూ, ప్రపంచాన్ని తమదైన దృష్టితో చూస్తూ, మన దృష్టికోణానికి అందని ఎన్నో విశేషాల్ని అందించగల దశ వారిది. ఆ వయసు పిల్లలతో జీవించడమే ఒక ఎడ్యుకేషన్. అది నేను మిస్సయిపోతున్నానని బాధొచ్చేది శ్రీమతి ఉత్తరాలు చదువుతుంటే.

అమ్మాయికి దగ్గొస్తే, దగ్గడమయ్యాక, "నాన్నగారుంటే వీపు నిమిరేవారు" అంటుందిట. ఎక్కడైనా తనీడు పిల్ల తండ్రితో కనబడితే, ఆ జంట వంక అసూయగా చూస్తుందిట. అబ్బాయైతే అస్తమానూ, "భువనేశ్వర్వెళ్లిపోదాం. అక్కడ నాన్నగారుంటారు" అని ఏడుస్తాట్ట.

ఇక మా అమ్మ పిల్లలకేమీ తీసిపోలేదు. ఎవరిమీదైనా కోపమొస్తే, "నాకు చిరాకు తెప్పించారంటే, జర్మనీలో బాబి దగ్గరకు వెళ్లిపోతాను" అంటోందిట – అక్కడికి అదేదో పక్క ఊరైనట్లు.

'మేమిద్దరం, మాకిద్దరు' అనే ప్రచారం ఊపులో ఉన్న రోజులవి. ఈ మధ్యలో శ్రీమతి ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకుంది. ఆమె ఆపరేషన్ చేయించుకుంటుందని తెలుసు. కానీ వివరాలు తెలుసుకుందుకు ఇప్పటిలా మొబైల్సా, ఇంటర్నెట్టా? మా వాళ్లెవరికీ ఇంట్లో టెలిఫోన్ సదుపాయం కూడా లేదు. ఒక వారం రోజులు నా మనోవ్యథ ఇంతా అంతా కాదు. ఆశ్చర్యమేమిటంటే ఎప్పుడూ ఉత్తరాలు వ్రాయని మా నాన్నగారు, కోడలు ఆపరేషన్ చేయించుకుందనీ, క్షేమంగా ఉందనీ నాకో ఉత్తరం వ్రాశారు. అదే నా శ్రీమతి క్షేమాన్ని తెలియబర్చిన మొదటి ఉత్తరం. ఆ తర్వాత శ్రీమతి వ్రాసిన ఉత్తరం చదివితే, ఆయనకు తెలియని విశేషాలు కొన్ని తెలిశాయి.

మామూలుగా ఐతే ట్యూబెక్టమీ చిన్న ఆపరేషన్. కానీ అందరికీ పావుగంట పట్టేది తనకి గంట పట్టిందిట. ఆపరేషన్ చేయించుకున్నందుకు, 28 రూపాయలిచ్చారుట. 8 రూపాయలు హాస్పిటల్ స్టాఫ్కి ఇచ్చేసిందిట. మిగతా ఇరవై రూపాయలకీ మరో ఐదు రూపాయలు వేసి మా అత్తగారికీ, ఆమెకు సాయంగా ఉంటున్న ఓ దూరపుబంధువుకీ చెరో వెండిగిన్నె కొనిచ్చిందిట. ఐతే ఆపరేషన్ సమయంలో తనకి ఆక్సిజన్ పెట్టాల్సి వచ్చిందనీ, వెంట్రుకవాసిలో ప్రాణప్రమాదం తప్పిందనీ తెలిసినప్పుడు నా గుండె ఓసారి ఆగి మళ్లీ కొట్టుకుంది.

ఆమెనుంచి ఉత్తరం అందినప్పుడల్లా నాలో ఉత్సాహం ఉరకలు వేసేది. ఉత్తరం చదువుతుంటే దిగులు కలిగేది. ఉత్తరానికి జవాబిస్తుంటే గుండె బరువెక్కేది.

వివాహమయ్యేక ఇంతటి దీర్ఘ విరహానికి గురిజావడం ఇదే మొదలు.

మా ప్రేమబలం మమ్మల్నిద్దర్నీ దగ్గర చెయ్యదా అనుకుంటూండేవాణ్ణి నేను.

ఇటువంటి దేశాల్లో ఉన్నప్పుడు ఏకాంతం మంచిది కాదనేవాడు సుబ్రహ్మణ్యం. అయితే రచనలు చేయాలన్న తపన నన్ను ఏకాంతానికి సుముఖుణ్ణి చేసేది. విరహంతోనే కథలూ వ్రాసేవాణ్ణి. ఉత్తరంతోపాటు ఆవగింజంత అక్షరాలతో (కాగితాలెక్కువైతే కవరు బరువు పెరిగి స్టాంపులెక్కువ అంటించాల్సొస్తుంది మరి) కథలు కూడా పంపేవాణ్ణి శ్రీమతికి. అవి ఆమె ఫెయిర్ చేసి పత్రికలకు పంపుతూండేది. ఇప్పుడా ఉత్తరాలు చూస్తుంటే, వ్రాసిన నాకంటే, చదివి ఫెయిర్ చేసినవారిదే పూర్తి ఘనత అనిపిస్తుంది.

అక్కడుండగానే జ్యోతి మాసపత్రిక తొలిసారిగా నవలానుబంధాన్ని ప్రవేశపెట్టింది. తొలి అనుబంధంలో బొమ్మ హేమాదేవి నవల అభిలాష, మల్లాది వెంకటకృష్ణమూర్తి సీరియల్(మేఘమాల), మా మినీనవల (మృత్యుదేవత) ఉన్నాయి. ఆ పుస్తకం నేరుగా ల్యానబర్గ్

చిరునామాకి వచ్చింది. అప్పుడు జ్యోతి చూస్తున్న వేమూరి సత్యనారాయణ – మా అమ్మాయి పుట్టేక ఆ అనుభవాలతో వ్రాసిన, పెళ్లయ్యాక చూడు నవల కూడా పరిశీలనలో ఉన్నట్లు – ఉత్తరం వ్రాశారు. అదే మాకాయనతో తొలి పరిచయం.

నా సాహచర్య ప్రభావం ఊరికే పోలేదు. ఒంటరితనం, విరహాన్ని అధిగమించాలన్న కోరిక – ప్రేరేపించాయేమో – శ్రీమతి కూడా తనకు తానై ఓ కథ రాసి ఓ పత్రికలో ప్రచురించగలిగింది. ఆమె ఆ విషయం తెలియబర్చినప్పుడు నాకెంత సంతోషం కలిగిందో చెప్పలేను.

మిత్రుల సాహచర్యం, ఇంటినుంచి ఉత్తరాలు. ఇవే కాదు, జర్మన్ క్లాసులు కూడా నాకెంతో రిలీఫ్నిచ్చేవి.

## బడి ఒడిలో

మా క్లాసులో వివిధ దేశాల వారున్నారు. అంతా మంచివాళ్లు. సరదా అయినవాళ్లు.

అందరిలోనూ నాకు ఫ్రౌలైన్ (కుమారి) కాసింబర్గ్ అనే ఫ్రెంచ్ యువతితో మంచి స్నేహమైంది. చాలా విషయాల్లో అభిప్రాయాలొకటి కావడం అందుకో కారణం.

ఇండియాలో నా మిత్రుడు సూర్యనారాయణకి స్టాంపు కలెక్షన్ హాబీ. నేను జర్మనీ వెడుతున్నాననగానే అతను బ్రహ్మానందపడిపోయాడు – నా ద్వారా చాలా స్టాంపులొస్తాయని. అది నాకు గుర్తుంది. నా క్లాస్‌మేట్సులో ఇతర దేశాలవాళ్లందరికీ అతని హాబీ గురించి చెప్పి – వారి వారి దేశాల పాత స్టాంపులు కావాలని అడిగేవాణ్ణి. నాకోసమే అయితే అంత చొరవ చెయ్యగలవాణ్ణి కాదేమో మరి!

స్టాంపులకోసం కొత్త పరిచయాలకోసం నేను ఇన్‌స్టిట్యూట్లో అప్పుడప్పుడు టేబుల్‌టెన్నిస్ గదికి వెళ్లేవాణ్ణి. అక్కడ ఎక్కువగా జపనీయులు ఉండేవాళ్లు. చూసి ఆనందించడమే తప్ప ఎక్కువ ఆడేవాణ్ణి కాదు. ఒకసారి ఎవరో బలవంతపెడితే ఆటలోకి దిగాను. ప్రథమ ప్రయత్నంలోనే ఓ జపనీయుణ్ణి ఓడించాను. అప్పట్లో టేబుల్‌టెన్నిస్ ఆటకి జపనీయులు పెట్టింది పేరు. ఆ కుర్రాడి స్థాయి ఏమైనా, నా జీవితంలో నేను ఒక జపాన్ ఆటగాణ్ణి ఓడించానని మనసులో గర్వపడ్డాను. నా ఆట చూసి ఫ్రౌలైన్ ఫుకునో అనే జపాన్ యువతి నన్ను పార్టనర్ని చేసుకుని ఒకటి రెండు గేమ్సాడింది. రెండూ మేమే నెగ్గాం. అందుకు మెచ్చిందేమో – తర్వాత నాకు సరికొత్త జపనీస్ స్టాంప్స్ రెండు షీట్లు తెచ్చి ఇచ్చింది. కలెక్షన్‌కి కొత్తవి అవసరం లేదని చెప్పినా వినిపించుకోలేదు. అవి సూర్యనారాయణకు పంపిస్తే అతను మహదానందంతో జవాబు వ్రాసాడు.

జర్మన్ భాష అంత కష్టం కాదు కానీ, వ్యాకరణం సంస్కృతంలా క్లిష్టమైనది. అవగాహనకు చాలా కృషి అవసరం. మా క్లాసులో జపనీయులు ఇద్దరమ్మాయిలూ, ముగ్గురబ్బాయిలూ ఉండేవారు. వాళ్లు క్లాసులో చాలా శ్రద్ధగా పాఠాలు ఫాలో అయ్యేవారు. వాళ్ల సిన్సియారిటీ నాకు ఆశ్చర్యం కలిగించేది. శ్రద్ధలో కాకపోయినా, తెలివితేటల్లో వాళ్లతో పోటీ పడేవాళ్లు ఇండియన్స్.

సాధారణంగా లాల్ క్లాసులో మొదటివాడుగా ఉండేవాడు. నేను మొదటి అయిదుగురిలో ఒకణ్ణి. ఈ ర్యాంకుల విషయంలో మేమంతా స్కూలుపిల్లల్లా ప్రవర్తించేవాళ్లం. టీచర్ మార్కుల విషయంలో అన్యాయం చేసిందని ఆరోపించేవారు కొందరైతే, పరీక్షలో కాపీ కొట్టేవారు కొందరు. ఒకసారి అన్ని స్పెల్లింగులూ కరెక్టుగా వ్రాసిన నాకు ఓ పదానికి తక్కువ మార్కులు వెయ్యడంవల్ల – ఆ రోజుకి ఫస్టుకి బదులు నాల్గవ పొజిషనుకి పడిపోయానని టీచర్‌కి ఫిర్యాదు చేశాను. అబద్ధమెందుకూ, అప్పుడు నేను రోషంగానే ఉన్నాను. కానీ టీచరు చెప్పింది – నేను ఒక వాక్యంలో మధ్యపదానికి మొదటి అక్షరం స్మాల్ లెటర్‌కి బదులు కాపిటల్ లెటర్ వ్రాసేనని. కానీ చిన్నప్పట్నించీ ఎక్కడ వాడినా కె అనే అక్షరాన్ని ఒక్కలాగే వ్రాయడం నాకు అలవాటు. కాపిటల్ ఐతే పెద్దగానూ, స్మాల్‌అయితే చిన్నగానూ వ్రాసేవాణ్ణి. ఇంగ్లీషు భాషకు సంబంధించిన పరీక్షల్లో కూడా అది చెల్లుబడి ఐపోయేది. ఆ విషయం మరీమరీ చెప్పినా టీచర్ ఒప్పుకోలేదు. స్మాల్ 'కె' కి మొదటి నిలువు గీత చిన్నదిగా ఉండాలని (K, k) నొక్కించింది. అప్పుడు నేను గ్రహించాను – అంతవరకూ నేను చేస్తున్నది తప్పని. మళ్లీ జీవితంలో ఆ తప్పు చెయ్యలేదు.

మా క్లాసులో ఆఫ్రికన్స్ సంఖ్య ఎక్కువే. వారిలో మ్బాయా (Mbaya) అనే అతను చిన్నపిల్లాడిలా చాలా అల్లరి చేసేవాడు. అతనివల్ల క్లాసు సరదాగా ఉండేది. ఐతే ఎక్కువగా అతను సెక్సుకు సంబంధించిన విషయాలు కూడా ఏమాత్రం సంకోచం లేకుండా మాట్లాడేవాడు. టీచరుతో మాట్లాడినప్పుడు పాశ్చాత్యదేశాల్లోని శృంగార విశృంఖలత్వాన్నీ, పాశ్చాత్యుల కాపిటలిజంలో దోపిడినీ నిరసించేవాడు. వాదనలో చతురుడు. తను యునెస్కో ప్రొఫెసరుట. డబ్బు దండిగా ఖర్చు పెట్టేవాడు.

ఒకరోజు అతను క్లాసుకి ఓ స్థానిక పత్రిక తీసుకొచ్చి, అందులోని ఓ ప్రకటనని అందరికీ చూపించాడు. తన కుక్కని ఎంతగానో ప్రేమించిన ఓ మహిళ ఇచ్చిన ప్రకటన అది. ఆ కుక్కను కనుక వెదికి తెచ్చిస్తే – తెచ్చిన వ్యక్తి మహిళ ఐతే నగదు బహుమతి. అదే పురుషుడైతే అతనితో ఒక రాత్రి గడపడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆమె ప్రకటించింది. పేపర్లో ఆమె ఫొటోతోపాటు, సాధారణంగా అందాల పోటీకి ఇచ్చే శరీరపు కొలతలు కూడా ఉన్నాయి.

హెర్ మ్బాయా ఆ ప్రకటన చదివి వినిపించి, "ఒక కుక్కపిల్ల పాటి విలువ చెయ్యని శీలం గల మహిళలున్న ఈ దేశం ఏంచూసుకుని గర్వపడాలి? ఇలాంటి ప్రకటనలిచ్చే స్థితికి దిగజారిపోయిన పౌరులుంటే – ఆర్థికంగా ఎంతటి ప్రగతి సాధిస్తే మాత్రం, ఆ దేశానికి విలువుంటుంది?" అని రెచ్చిపోయి మాట్లాడాడు.

ఆ ప్రకటన చదివి నేను షాక్ తిన్నాను. కానీ నాకు మ్బాయా తీరు నచ్చలేదు. ఊరుకోలేక, "ఇలాంటి ప్రకటనలు మానవ మనస్తత్వంలోని వైచిత్ర్యానికి చిహ్నం. ఇలాంటి వ్యక్తులు అన్ని దేశాల్లోనూ ఉండొచ్చు. వారిని అర్థం చేసుకుని జీర్ణించుకునే పరిణతికి ఈ సమాజం చేరుకుందనుకోవాలి తప్పితే, ఆ మహిళ ఇక్కడి పౌరులకు శాంపుల్ అనుకోలేం. ఈ ప్రకటన ఈ దేశ ప్రజల నైతికస్థాయిని ప్రతిబింబించదు. ఎందుకంటే ఇంతకాలంగా ఇక్కడుంటూ, ఈ ప్రకటన చూసి షాక్ తిన్నామంటే, అధిక సంఖ్యాకులైన పౌరులు దీనికి భిన్నంగా ఉన్నారనే అర్థం కదా" అన్నాను వెంటనే.

మ్బాయా నావంక అదోలా చూసి కన్ను గీటాడు. "యూ, ఇండియన్! నువ్వు మాట్లాడకు. నా విషయంలో కలగజేసుకోకు. నేనీ విషయం ఈరోజు క్లాసులో టీచరుకి చెప్పాల్సిందే" అన్నాడు.

అతనీ విషయమై నాతో వాదనకు దిగే ఉద్దేశ్యంలో లేడని అర్థమై నేనిక ఊరుకున్నాను. క్లాసులో అతడా వార్త చదివి వినిపించినప్పుడు, మా టీచరు ముఖం అదోలాగైపోయింది. ఐతే ఆమె అతనికి బదులేమీ ఇవ్వకుండా విషయాన్ని దాటేసి పాఠంలోకి వెళ్లిపోయింది.

ఎందుకో కానీ మ్బాయాకి పాశ్చాత్య వ్యవస్థనీ, సంస్కృతినీ వేలెత్తి చూపడంమీద ఆసక్తి ఎక్కువ. మరోసారి అతను క్లాసులోనే ఇంకో వివాదానికి తెర తీశాడు. పశ్చిమ జర్మనీలో వ్యక్తిస్వాతంత్ర్యం ఉందంటున్నారు కానీ అది నిజం కాదన్నాడు.

ఈసారి మా జర్మన్ టీచర్ ఊరుకోలేదు. తమ దేశం అసలైన స్వేచ్ఛకి మారుపేరంది. దాన్ని కొందరు పౌరులు దురుపయోగం కూడా చేస్తారంటూ, గతంలో ప్రస్తావించిన పత్రికా ప్రకటనకు పరోక్షంగా బదులిచ్చింది.

హెర్ మ్బాయా ఊరుకోలేదు. వెంటనే క్యోల్న్ నగరంలో జరిగిన ఒక సంఘటనని ఉదహరించాడు. ఆ నగరంలో ఒక విద్యార్థి క్లాసులో ప్రొఫెసర్ని ఎదిరించేట్ట. ప్రొఫెసర్ వెంటనే పోలీసులకి ఫోన్ చేసేట్ట. పోలీసులు వచ్చి ఆ విద్యార్థిని అరెస్టు చేసి జైల్లో పడేశారుట.

"నేను నమ్మను" అంది మా టీచర్.

"అందుకు సాక్ష్యముంది" అన్నాడు హెర్ మ్బాయా. ఇంటర్వల్లో అతను మరో జర్మన్ టీచర్ని క్లాసుకి పిలిచి, "క్యోల్న్‌లో ఒక విద్యార్థి ప్రొఫెసర్ని ఎదిరిస్తే – ఆయన పోలీసులకు ఫోన్ చేస్తే, పోలీసులొచ్చి ఆ విద్యార్థిని జైల్లో పడేయలేదూ?" అనడిగాడు.

ఆయన యథాలాపంగా, "అవును. ఏం?" అన్నాడు.

మా క్లాస్‌టీచర్ ముఖం మాడిపోయింది. “అలా ఎలా జరుగుతుంది?” అని తనలో తాను గొణుక్కుంది తప్పితే మరి వాదనని పొడిగించలేదు.

నాకు ఆశ్చర్యంగా అనిపించింది. జాతి పేరిట, రంగు పేరిట – మానసికంగా పౌరుల్లో అసహనం ఉండొచ్చు. కానీ దాన్ని దాచుకునే సంస్కారాన్ని మేమక్కడ చూశాం.

అలాంటి సంస్కారానికి నియమాలూ, చట్టాలూ కూడా కొంత కారణమౌతాయని నా నమ్మకం. సాంస్కృతిక పరంగానో, ఆహారపుటలవాట్ల విషయంలోనో ఐతే మాకా దేశం భిన్నంగా అనిపించవచ్చు. కానీ అక్కడ స్వదేశానికి మించి స్వేచ్ఛ అనుభవిస్తున్నామని ఒప్పుకోవాలి. అలాంటిది కేవలం ప్రొఫెసర్ని క్లాసులో ఎదిరించిన నేరానికి, ఒక విద్యార్థి జైలు పాలౌతాడా? అలాగైతే ఈపాటికే మ్యాయా జైల్లో ఉండాలి. నాకు అనుమానమొచ్చి హెర్ మ్యాయాను పక్కకు పిలిచి, “ఇంతకీ అ విద్యార్థి ప్రొఫెసర్ని ఏమని ఎదిరించాడు?” ఆనడిగాను.

మ్యాయా కన్ను గీటి అదోలా నవ్వుతూ, “అది వాళ్లడగాల్సిన మాట. వాళ్లే అడగనప్పుడు – నువ్వడక్కూడదు. నేను చెప్పకూడదు” అన్నాడు.

నాకు అర్థమైంది, ఆ రోజు క్లాసులో ఆ విద్యార్థి ప్రవర్తనలో క్రిమినల్ ట్రెట్ ఉండొచ్చని!

ఇక్కడే నాకు ఆశ్చర్యంగా ఉండేది. ఈ లాంగ్వేజి క్లాసుల్లో జర్మన్ టీచర్సు ఏ విషయంలోనూ ఎక్కువగా వాదనలోకి దిగడానికి ఇష్టపడేవారు కాదు. ఏదిఏమైనా ఒకటి మాత్రం నిజం. పశ్చిమ జర్మనీలో వ్యక్తి స్వాతంత్ర్యముందన్న విషయాన్ని నిరూపించుకుందుకు వాదన అవసరం లేదు. అందుకు మ్యాయాయే సాక్షి.

హెర్ మ్యాయా తెల్లవాళ్ల గురించి హీనంగా మాట్లాడేవాడు. శ్వేతసుందరీమణుల్ని అనుభవించడంకోసమే తనీ దేశాల్లో తిరుగుతున్నాననేవాడు.

నాకు స్వానుభవమే – మాటల్ని బట్టి వ్యక్తిత్వాల్ని అంచనా వెయ్యలేం. దళితుల్ని కులం పేరు పెట్టి హీనపర్చే ఒక టీచరు – వాస్తవంలో దళితుల్ని ఆత్మీయంగా ఆదుకోవడం నాకు తెలుసు. అగ్రకులాల్ని అనరాని మాటలనే ఓ దళితుడు నన్ను అభిమానించే ప్రాణమిత్రుడు.

శరీరంలో కల్మషాన్ని విడిచిపెట్టడానికి దేవుడు మనిషికి కొన్ని మార్గాలిచ్చాడు. అందుకు కొందరు మనుషులు మాటని కూడా ఉపయోగించుకుంటారు. మాట మంచిదైతే సంస్కారానికి చిహ్నం. చెడ్డదైతే – వ్యక్తి స్వాతంత్ర్యానికి నిదర్శనం. మాటతో వ్యక్తుల్ని అంచనా వేస్తే మన నేతలంత దుష్టులుండరు. కానీ మనం ఎంతో కొంత ముందుకే వెడుతున్నామంటే మన నేతలే కదా, కారణం!

జర్మన్ క్లాసుల్లో గుర్తుండిపోయే మరో విశేషం – క్లాసులో జర్మన్ తప్ప ఇంకేమీ మాట్లాడకూడదని నియమం. నియమం ఉల్లంఘిస్తే పది ఫెనిగ్స్ జరిమానా. అలా వసూలు చేసిన డబ్బుల కోసం, టీచర్ ఓ హుండీ పెట్టింది కూడా. అనుకోకుండా ఎవరి నోటైనా ఆంగ్లపదం జారితే, “చెన్(పది) ఫెనిగ్స్ బిట్టే (ప్లీజ్)” అనేదామె.

ఈవిధంగా ఎక్కువ ఫైన్ కట్టినవారు హెర్ మ్యాయా, బ్రెజిలియన్ అమ్మాయి ఫ్రొలైన్ కురాసీ. ఆ అమ్మాయికైతే అప్రయత్నంగా ఆంగ్లపదాలు నోట జాలువారిపోతూండేవి. ఒకోసారి టీచరుకే జాలేసి, డిస్కౌంట్ ఇచ్చి జరిమానా తగ్గించేది.

డబ్బు విషయంలో నా జాగ్రత్తకి నిదర్శనంగా, ఒక్క పర్యాయం కూడా నేను జరిమానా కట్టలేదు.

మా క్లాస్‌టీచర్ నా అలవాట్లకు ఆశ్చర్యపడేది. గెమ్యూజే (కూరగాయలు) తప్ప తిననని జాలిపడేది. రావు అన్న నా పేరుని గెమ్యూజేకి పర్యాయపదంగా వాడేటంతగా నా అలవాట్లని గుర్తించుకన్న ఆమె కూడా నన్ను పద్దెనిమిదేళ్ల బాలుడనే అనుకుంది. నేను ఇద్దరు పిల్లల తండ్రినని తెలియగానే ఆమె షాక్ తిని, “ఆల్కహాల్ జోలికి వెళ్లకపోతే అంతా నీకులాగే ఉంటారేమో” అంది అప్రయత్నంగా. కానీ చాలామంది

ఇండియన్ల యంగ్లుక్స్‌కి కారణం అండర్‌నరిష్మెంట్ అని ఎక్కడో చదివాను. అలాంటివాళ్లు ముప్పైలలో ఇరవైలనిపించినా, అరవైల్లో ఎనభైలనిపించే అవకాశముందిట. అదామెకి చెప్పలేదు.

క్లాసులో మా గతి చిన్నప్పటి వీధిబడిలోలా ఉండేది. జర్మన్ భాషలో వారాల పేర్లూ, నెలల పేర్లూ, అంకెలూ ఒకరి తరవాత ఒకరిచేత చెప్పించేవారు. బెంచిలో నా పక్కనున్నవాడు జోన్‌టాగ్ (ఆదివారం) అంటే, నేను మోన్‌టాగ్ (సోమవారం) అనాలి. ఆ పక్కనున్నవాడు డీన్‌స్టాగ్ (మంగళవారం) అంటాడు. ఇలా వరుసగా చెప్పుకుంటూ వెళ్లడమే. మొదట్లో ఇది చిన్నతనంగా ఉండేది. రెండొకట్ల రెండు, రెండు రెళ్లు నాలుగు... అని వల్లె వేయించే వీధిబడులు గుర్తొచ్చి ఒక్కసారిగా చిన్నతనం పసితనంగా మారిపోయేది. మానసికానందానికి పసితనాన్ని మించినదేముంటుంది?

శ్రీమతికీ, పిల్లలకీ ఇది ఎంతో వినోదంగా ఉంటుందనిపించి ఒకరోజు క్లాస్‌రూంలో పాఠాల ఎపిసోడ్స్ రికార్డ్ చేశాను – తర్వాత వినిపించాలని!

నాలుగు నెలల లాంగ్వేజి కోర్సులో మొదటి రెండు నెలలూ ఫ్రౌ ష్వియరింగ్ మా టీచర్. తర్వాతి రెండు నెలలూ హెర్ షీమాంగ్. ఇద్దరికిద్దరూ మంచి మిత్రుల్లా మాతో కలిసిపోయారు.

మా క్లాసులో వాళ్లే కాక, ఇతర క్లాసులవాళ్లు కూడా కొందరు జీవితంలో మరపురాని పరిచయస్థులు. ఒకతనిది ఫిలిప్పీన్స్. అతను విపరీతంగా స్వంతడబ్బాని వాయించేవాడు. అతను చేసిన రీసెర్చికి ఏదో బహుమతి వచ్చిందట. ఆ బహుమతి ఏమిటని అడిగితే పేరు చెప్పలేదు కానీ, "నోబెల్ ప్రయిజ్ ఆఫ్ ది ఈస్ట్" అన్నాడు. వినోదం కావాలనిపించినప్పుడల్లా అతన్నోసారి పలకరిస్తూండేవాణ్ణి. వినోదం అందించడానికి స్వంత డబ్బా వాయించుకునే వాళ్లని మించినవాళ్లుండరు. ఎటొచ్చీ చాలామంది ఇతరుల స్వంత డబ్బాని భరించలేరు. ఇంతకీ ఈ ఫిలిప్పీన్స్ పౌరుడు రామచంద్ర క్లాస్‌మేటు.

ల్యానబర్గులో గడిపిన నాలుగు నెలల్లోనూ, ఇంకా చాలామందే తటస్థపడి – విచిత్రమైనవీ, మరపురానివీ, ఆసక్తికరమైనవీ ఎన్నో అనుభవాలు అందించారు నాకు. అలా జర్మనీ పాఠాలకంటె ఎక్కువగా జీవిత పాఠాలు నేర్చుకున్నాను. జర్మన్ యువతి ఫ్రౌలైన్ బ్రిగెట్టీ హైనమన్‌తో ప్రారంభమయ్యాయవి.

### *చీరకట్టీ సింగారించీ*

అక్కడ స్వంతిళ్లున్న చాలామంది తమ ఇళ్లని పూటకూళ్లలా కూడా నడుపుతారు. ఆధునిక భాషలో దాన్ని పేయింగ్‌గెస్ట్ సిస్టం అంటారు. అందుకుగానూ కొందరు ఇళ్లవాళ్లు తమ పేర్లను టూరిస్ట్ డిపార్టుమెంట్లో నమోదు చేయించుకుంటారు. ఫ్రౌ యాకేల్ పేరు కూడా అలా నమోదయింది. గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వారే కాక బయటివాళ్లు కూడా ఆ సదుపాయం ఉపయోగించుకోవచ్చు.

స్వంత పనిమీద బయటి ఊళ్లనుంచి వచ్చినవాళ్లలో కొందరు లాడ్జిలకంటే ఇలాంటి పూటకూళ్ల ఇళ్లకే ప్రాధాన్యమిస్తారు. ల్యానబర్గ్ వచ్చిన బ్రిగెట్టీ హైనమన్ అలా ఫ్రౌ యాకేల్‌ఇంటికి వచ్చింది. ఆమెకి యాకేల్ నా గది ఎదుటనున్న పెద్ద గదిని కేటాయించింది. ఆ అంతస్తులోని మూడు గదుల్లోకీ అది చాలా పెద్దది.

జూన్ 5న నేను ఫ్రౌ యాకేల్ ఇంట్లో అడుగెట్టాను. జూన్ 14న యాకేల్ నన్ను ఫ్రౌలైన్ బ్రిగెట్టీ హైనమన్‌కి పరిచయం చేస్తూ, నాకు తెలియని ఓ కొత్త విషయం చెప్పింది. గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వారామెకు ఫోన్ చేసి, "చాలా తెలివైన మంచి ఇండియన్ యువకుడు వస్తున్నాడు. నీ ఇంట్లో గది ఇవ్వడానికి నీకేమైనా అభ్యంతరమా?" అనడిగారుట. ఆమె వెంటనే ఒప్పుకుందట. అలా నేనిక్కడికొచ్చాను.

ఆ అమ్మాయి వయసు ఇరవై లోపే వుండవచ్చు. సుమారు ఆరడుగుల పొడగరి. ఎత్తుకి తగ్గ లావుతో ఆకారానికి పెద్దదానిలా ఉన్నా, అందమైన ఆమె ముఖానికి అమాయకత్వం జతపడి – చిన్నపిల్లలాగే అనిపిస్తుంది.

ఆమె తన్ను పరిచయం చేసుకుంటూ, ఫోల్క్‌స్వ్యాగెన్ కంపెనీలో సెక్రటరీగా పని చేస్తున్నానంది. ఇంగ్లీషు కొద్దిగా వచ్చునంది. కానీ, కలిసి మాట్లాడుకుందుకు అది సరిపోదని, మాటనిబట్టే గ్రహించాను.

యాకేల్ అందుకుని నా గురించి ప్రశంసలు మొదలెట్టింది. ఏమో అనుకుందిట కానీ, నా తెలివితేటలు ఇంతా అంతా కాదంది. పది రోజుల్లోనే జర్మన్ బోలెడంత నేర్చుకున్నానని గొప్పగా చెప్పింది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments